# జీవన గీతం

– రెంటాల నాగేశ్వరరావు

నాకు ప్రొఫెసర్‌షిప్ వచ్చాక కొంచెం అహంభావం పెరిగిందనుకుంటాను. అందరి ప్రొఫెసర్లతోపాటు ఒకే కాలనీలో వుండటం, వారిలో పెరిగిన పరిచయాలు, వారి సబ్జక్ట్స్ గురించి కూడా మాట్లాడటం, వివరాలు తెలుసుకోవటం చేస్తున్నారు. నాకు చాలా విషయాలు తెలుసుననే నిర్ణయానికి వచ్చాననుకుంటాను. 'అన్నీ నాకు తెలుసు' అనుకోవటంలోనే అజ్ఞానం పెరుగుతూ పోతుందని నాకు తెలుసు. కాని 'నాకు తెలుసు'నన్నది నేను నమ్మిన నిజం. ఇది అహంభావం కాదేమో, ఆత్మవిశ్వాసం పెరిగిందేమోననుకున్నాను. నేను యూనివర్సిటీలో సోషియాలజీలో రీడర్ నుండి ప్రమోషన్ పొందాను. అందుకేనేమో ప్రజలందరి జీవన విధానాలు, వారి నమ్మకాలు, ఆశలు, అనుబంధాలు... ఇలా ఎన్నో నాకు తెలుసునని నా నమ్మకం.

అయితే గత సంవత్సరంగా 'నాకు తెలియదు' అనే ఒక విషయం నా అహాన్ని దెబ్బ కొడుతోంది. ఒక మనిషిని నేనర్థం చేసుకోలేక పోతున్నాననిపిస్తుంది. అతడేమీ గొప్పవాడుకాడు, ఉద్యోగస్తుడు కాదని... అసలు నీతో మాట్లాడగలిగే అర్హత లేనివాడు! నేనూ అతనితో ఎప్పుడూ మాట్లాడలేదు. కాని, మా ఇంటి ఎదురుగానే వుండటంతో ~~ఓజూ~~ చూస్తూంటాను. అతడిని చూడగానే ముందు జుగుప్స కలుగుతుంది. నాకేసి నవ్వుతూ చూస్తాడతను. నేను తలత్రిప్పకుంటాను. అతని దారిన అతడు వెళ్ళి పోతాడు. నేను అతడి చిరునవ్వుని స్వీకరించలేదని తెలిసినా, మరునాడు నన్ను చూసి చిరునవ్వు నవ్వటం మానడు. ఇప్పుడతడే నా మెదడుకు, నా విజ్ఞానానికి ఒక సవాల్ అయి కూర్చున్నాడు.

●●●●

**జంతువుల బేసిక్ ఇన్‌స్టింగ్ట్‌లో ముఖ్యమైంది బ్రతకటం. ఇతడు కూడా పశు స్థాయి నుండి మానవుని ఆలోచనల స్థాయికి పెరగకపోవటమే అతడి జీవన రహస్యమా?**

●●●●

అతడెవరంటే –

పాలరాతి మీద పేడముద్దలా, మా ప్రొఫెసర్ల కాలనీలో, నా ఇంటి ఎదురుగా వున్న పెంకుటింట్లో వుంటాడతను. కాలనీ కట్టక ముందు నుండీ అతడక్కడే వుండేవాడట. అతడు ఎంత డబ్బిస్తామన్నా అతడా ఇల్లు వదలడు. శరీరంపై గజ్జికురుపులా, అతి విలాసవంతంగా వుండే మా కాలనీలో, అసహ్యంగా వుంటుందాతడి ఇల్లు. అతడికి యాభైఏళ్ళ పైనే వుంటాయి. పోనీ 'మనిషన్నా బాగుంటాడా' అంటే అదీ లేదు. నల్లగా, వడలిన శరీరంతో వుంటాడు. అయినా అతడి ముఖంపై చిరునవ్వు చెరగదు. అతడికిద్దరు కొడుకులు. ఇద్దరూ పొద్దుటే పనులకు వెళ్ళి పోతారు. ఇక కోడళ్ళు ఆతడిని పురుగును చూసినట్టు చూస్తారు. ముష్టాడికి పడేసినట్టు ఇంత తిండి పడేస్తారు.. అంతే ఇక అతని గురించి ఏమీ పట్టించుకోరు. పట్టించుకున్నారంటే తిట్లవర్షం కురిసిందన్నమాటే!



నిజానికతడు ముష్టాడిలానే వుంటాడు. అతడికి రెండు కాళ్ళు తొడల వరకు ఏదో ప్రమాదంలో పోయాయి. ఎడమ చేయి చచ్చుపడింది. ఒక చిన్న పీటకు నాలుగు చక్రాలు బిగించి దాని మీద కూర్చుని, కుడిచేత్తో తోసుకుంటూ ప్రొద్దుటే బయటకు బయల్దేరతాడు. మళ్ళీ మధ్యాహ్నం అలాగే ఇంటికి చేరతాడు. దూరంనుండి తెలియని వాళ్ళు చూస్తే ముష్టెత్తుకునే కుష్ఠురోగిలా కనిపిస్తాడు. మళ్ళీ సాయంత్రం నాలుగింటికి బయల్దేరి, దగ్గరగా వున్న రైల్వే ట్రాక్ వరకు వెళతాడు. చీకటి పడుతుండగా తిరిగొస్తాడు. భోంచేసి, కోడళ్ళ తిట్లు తిని, నవ్వుకుని హాయిగా నిద్రిస్తాడు. అతడివల్ల ఇంట్లో వాళ్ళకి బరువు తప్ప, లాభంలేదు. బయట నా బోటి వారికి జుగుప్సతప్ప ప్రేమలేదు. కనీసం ఎవరూ ప్రతిగా చిరునవ్వుకూడా నవ్వరు.

నా కర్థంకాని విషయం అదొక్కటే.

అతడు ప్రేమరాహిత్యంలో బ్రతుకుతున్నాడు. అతడి వలన ఎవరికీ ఉపయోగం లేదు. నష్టం తప్ప. పైపెచ్చు తిట్లు, శాపనార్థాలు, వ్యంగవు విసుర్లు, నీచంగా చూడబడటం... ఇలాంటివెన్నో... మరి అసలు అతడు ఎందుకు బ్రతికివున్నట్టు? అందరికీ భారమై అలాటి నరకంలో బ్రతకటం కంటే చావు నయం కదా? మరెందుకు ఆత్మహత్య చేసుకోడు? అదీ – నాకర్థం కాని విషయం.

జంతువుల 'బేసిక్ ఇన్‌స్టింగ్స్'లో ముఖ్యమైంది బ్రతకటం. వాటికి ఆలోచనలు తక్కువగనుక –


ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 5-5-95

చనిపోదామని అనుకోవు. అసలు ఎలా చనిపోవాలో వాటికి తెలియదు. ఇతడు కూడా పశు స్థాయి నుండి మానవుని ఆలోచనల స్థాయికి పెరగక పోవటమే అతడి జీవన రహస్యమా? కాదు. జంతువులకు నవ్వటం తెలియదు. ఇతడికి మనస్ఫూర్తిగా నవ్వటం తెలుసు. ఎన్ని తిట్లు తిన్నా, ఎన్ని బాధలొచ్చినా నవ్వుతూనే వుంటాడు. ఆ నవ్వు చూస్తే నాకు వళ్ళు మంట. చదువు, హోదా పెరిగిన కొద్దీ – నవ్వు కూడా ధనంలాగానే పొదుపుగా వాడతారు నవనాగరీకులు.

ఒకరోజు సన్నటి జల్లు పడుతుంటే స్కూటర్ని ప్రక్కకు తీసి ఒక బస్ షెల్టర్‌లో ఆపాను. అతనూ అక్కడేవున్నాడు చిరునవ్వుతో, ఆ చక్రాల బండిపై.

'వాన ఎంత అందంగా వుంది సార్!' అన్నాడతను. ముఖం చిట్లించాను నేను.

'వానకు తడిసిన మట్టి వాసన ఎంత బావుంటుందో' నవ్వుతూనే అన్నాడతను. నాకతడితో మాట్లాడాలనిపించలేదు, వానలో తడుస్తూనే ఇంటి కెళ్ళిపోయాను.

రోజూ ప్రొద్దుటే లేస్తాడతడు. స్నానం చేసి ఉదయించే సూర్యుని, పక్షుల కిలకిలరావాల్ని కదిలే మేఘాల్ని, పిల్లగాలికి ఊగే రెమ్మలను చూస్తూ పరవశిస్తూ తనలో తానే నవ్వుకుంటుంటాడు. ఆ చిరునవ్వుని చూస్తేనే నాకు చిరాకు.

ఇతడి వలన ఇంట్లోవారికి గాని, సంఘానికి కాని ఉపయోగం లేదు. అనురాగం, ప్రేమ, ఆత్మీయులూ అలాటి వేవీ అతడికి తెలియవు. మరి బ్రతకటమెందుకట? బ్రతికి సాధించేదేమిటట? అవీ నాకు సమాధానం తెలియని ప్రశ్నలే.

ఒకరోజు యూనివర్సిటీ నుండి వచ్చేసరికి కొంచెం చీకటి పడింది. అందుకని స్కూటర్ మీద స్పీడుగా వస్తున్నాను. అందులో ఆ రోజే ఎమ్సెట్ రిజల్ట్స్ వచ్చాయి. మా అమ్మాయికి సీట్ రాలేదు. అందుచేత కోపంగానూ, చిరాకుగానూ వుంది.

కాలనీలోకి అడుగుపెట్టగానే అతడు స్కూటర్‌కి అడ్డంగా వచ్చాడు. విసుక్కుంటూ సడన్ బ్రేక్ వేసి ఆపాను.

"సారీ..."

"ఏమిటి?" విసుగ్గా కోపంగా అన్నాను. అదే అతడిలో మొదటిసారి మాట్లాడటం.

"అమ్మాయిగారికి ఎమ్‌సెట్‌లో సీట్‌రాలేదని రైలు కింద పడబోయారు సార్... నేనే తప్పించాను. మీరింటికెళ్లి కోప్పడకండిసార్... ఈ కాలం పిల్లలకి అంతా ఉద్రేకమేసార్... జీవితం విలువ తెలియదు..." వార్త వినగానే నా వళ్ళు ఘల్లుమన్నది. "థాంక్యూ" అనే నాగరికపు పదాన్ని వాడి స్కూటర్ ముందుకు దూకించాను. త్వరగా ఇంటికెళ్ళాను.

సోఫాలో కూర్చుని తమ్ముడితో నవ్వుతూ కబుర్లు చెబుతోంది నా కూతురు.

"ఆ ఎదురింటి ముసలోడు చెప్పింది నిజమేనా?" కోపాన్ని బాగా తగ్గించుకుని అనునయంగా అడిగాను. నవ్వేసి 'అవున'న్నట్టు తలూపింది. "ఏంటో ఉద్రేకంలో విరక్తి కలిగింది... ఇక ఎప్పుడూ అలా చేయను... చేయబోను కూడా... ఆ తాత జీవిత సత్యం చెప్పాడు నాన్నా! అతడెంతో చదువుకున్న వాడు కూడాను" నవ్వుతూనే చెప్పింది. ఎమ్‌సెట్‌లో సీట్ రాలేదే అనే బాధ దానిలో కనిపించలేదు. అది ఏడుస్తూ వుంటుంది. భోజనం చేయదు. బుజ్జగించి తినిపించాలి అని ఆలోచిస్తూ వచ్చాను నేను. కాని నా బిడ్డలో ఎంత మార్పు?!

నేనూ నవ్వాను రిలీఫ్‌గా ఆమెను కోప్పడదలచలేదు.

"ఏవిటా జీవిత సత్యం?" నవ్వుతూనే అడిగాను.

మాట్లాడలేదు. లేక మాట్లాడటం చేతకాలేదో... 'కాఫీ తెస్తాన"ని లోనికెళ్ళింది.

ఏదైనా ఆ ముసలోడి మీద నాకు సదభిప్రాయం కలిగింది.

మరునాడుదయం అతడు బయటకి వెళుతూ నాకేసి చూసి నవ్వాడు. అదే చిరునవ్వు. ఎప్పుడూ చెదరని చిరునవ్వు. వికసించిన గులాబీల్లాంటి నవ్వు.

నేనూ మొదటిసారిగా ప్రత్యుత్తరంగా నవ్వాను.

అతడు వెళ్ళిపోయాడు – నవ్వుతూనే. కానీ, నాలో మొదటిప్రశ్న మళ్ళీ వచ్చింది. అతడెందుకు బ్రతుకుతున్నాడు? ఆత్మహత్య చేసుకోకుండా? నాకు సమాధానం తెలియలేదు.

సాయంత్రం అతడు వెళ్ళిన కాసేపటికి నేనూ అతడు వెళ్ళిన వేపు వెళ్ళాను. నా బిడ్డను రక్షించినందుకు కనీసం కృతజ్ఞతలయినా చెప్పటం నాబోటి నాగరికుల లక్షణం కదా!



"నవ్వండి సార్! మనిషి మన స్ఫూర్తిగా నవ్వితే ప్రకృతి పులకరిస్తుంది. అది మన హక్కు. మన జీవన గతం... ప్రకృతి మనిషికిచ్చిన వరం..."

చిన్న రైల్వే బ్రిడ్జికి ప్రక్కగావున్న సిమెంట్ చప్టాపై కూర్చుని ప్రకృతిని చూస్తున్నాడతడు. అస్తమిస్తున్న సూర్యుడు, పైరగాలికి తలలూపే పచ్చటి పంట పొలాలు, చల్లగా వీచే గాలి... ప్రకృతిలో తానూ కలిసిపోయి వున్నాడతను. అతడి అధరాలపై చిరునవ్వు కళ్ళలో కొత్త కళ.

"రండిసార్ కూర్చోండి... షికారు కొచ్చారా?" నా అలికిడి విని, తన తన్మయత్వం నుండి బయటకు వచ్చి అన్నాడతడు. నవ్వుతూ ప్రక్కన కూర్చుని ఏదో చెప్పబోయాను.

"మీరేమీ చెప్పకండి సార్... మీరు చెప్పబోయేది నాకు తెలుసు. నాకలాటివి ఇష్టముండవు..." నవ్వాడతను.

నా అనుమానం తీర్చుకుందామనుకున్నాను గాని ఎలా అడగాలో అర్థం కాలేదు.

"ఎంత బావుందిసార్ ఈ ప్రదేశం... నాకు కాళ్ళు లేవుగాని వుంటే పరవశంతో నృత్యం చేసివుండేవాడిని..." నవ్వుతూ అన్నాడు. నేను మాట్లాడలేదు.

"నవ్వండిసార్! జంతువులకి మనుషులకు తేడా ఏమిటో మీకు తెలుసుసార్. భాషని వదిలేస్తే... మిగిలింది * నవ్వటమే సార్! మనిషి మనస్ఫూర్తిగా నవ్వితే ప్రకృతి పులకరిస్తుంది. అది మనహక్కు. మన జీవన గతం... ప్రకృతి మనిషికిచ్చినవరం..." నేను లేచాను. చిరునవ్వుతో అతడి భుజాన్ని తట్టి ముందుకు కదిలాను.

'నిజమే! ప్రకృతి ఎంత శోభాయమానంగా వుంది!' అనిపించింది. ఆలోచిస్తూ నడుస్తున్నాను. 'నిజమే... జీవించటమెందుకో అతడికి తెలుసు.' అతడికి తెలుసునని నాకర్థమయింది. నా చదువు, నా హోదా, నా డబ్బు, నా సంస్కారం, ఇవేవీ దానిని చెప్పలేదు. అదేదో నేను తెలుసుకున్నాననిపిస్తుంది. అంతలోనే తెలియదు. మరి మీకు తెలుసా?

*